నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, గురువారం 25 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడికి కల్యాణోత్సవ సేవ

యాదగిరిగుట్ట, జనవరి 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి ఆలయ తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపి స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. నారసింహుడి నిత్యోత్సవాలను అర్చకులు తెల్లవారుజాము నుంచే ప్రారంభించారు. స్వామివారికి సుప్రభాత సేవ, బిందె తీర్థం, ఆరాధనతోపాటు ఉదయం ఆరగింపు చేపట్టారు. నిజాభిషేకం, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం దర్బార్ సేవోత్సవం వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు పారాయణం జరిపించారు. నక్షత్ర హారతి ఇచ్చి మంత్రపుష్ప నీరాజనం గావించి ఆశీర్వచనం చేశారు. స్వామివారిని గరుఢ వాహనం, అమ్మవారిని తిరుచ్చీ వాహనంపై వేంచేపు చేసి ఆలయ తిరుమాఢ వీధుల్లో సేవ నిర్వహించారు. రాత్రి స్వామి వారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వామివారిని 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఖజానాకు రూ.16,80,479 ఆదాయం సమకూరినట్లు ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

• జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 24 : జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అభివృద్ధి పనులపై ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నీహెచ్ కృష్ణారెడ్డి, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

రామన్నపేట ఎంపీపీ అవిశ్వాసంపై కోర్టు స్టే

రామన్నపేట, జనవరి24 : రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిపై ఈ నెల 27న జరుగాల్సిన అవిశ్వాసంపై మంగళవారం హైకోర్టు స్టే విధించింది. ఎంపీపీ జ్యోతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ పది మంది ఎంపీటీసీలు ఈ నెల 4న చౌటుప్పల ఆర్డీఓ జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. దీంతో ఈ నెల 27న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ ఎంపీటీసీలకు ఈ నెల 6న ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో అవిశ్వాసంపై ఎంపీపీ జ్యోతి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాద ప్రతివాదనలు విన్న కోర్టు అవిశ్వాసంపై స్టే విధిస్తూ మధ్యంతర ఉతర్వులు జారీ చేసింది.

రాజ్‌భవన్ తేనీటి విందుకు జూలూరు వాసికి ఆహ్వానం

గుండాల గోవర్ధన్

భూదాన్ పోచంపల్లి జనవరి 24 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు రాజ్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన తేనీటి విందుకు భూదాన్ పోచంపల్లి మండలం జూలూరుకు చెందిన పర్యావరణ సేవా రత్న అవార్డు గ్రహీత గుండాల శోభా గోవర్ధన్‌కు ఆహ్వానం అందింది. కుల వృత్తిని జీవనాధారంగా ఎంచుకొని జీవిస్తూ మట్టి కుండలు, మట్టి వినాయక విగ్రహాలు చేస్తూ పర్యావరణాన్ని కాపాడడంలో ముందుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా మట్టి విగ్రహాలు, బొమ్మల తయారీలో 3,200 మందికి ఆయన శిక్షణ ఇచ్చారు. ప్రతి సంవత్సరం మట్టి విగ్రహాలను తయారు చేసి తన వంతు సహకారం అందిస్తున్నారు. రాజ్ భవన్ నుంచి ఆహ్వానం అందడం పట్ల గోవర్ధన్ సంతోషం వ్యక్తం చేశారు.

ప్రగతిని మరిచి.. పాలిట్రిక్స్

- జోరుగా క్యాంపులకు తరలుతున్న కౌన్సిలర్లు
- క్యాంపుల్లోనే ఆలేరు, మోత్కూరు మున్సిపల్ సభ్యులు
- ప్యాకేజీలు, తాయిలాలతో మచ్చికకు యత్నాలు
- సమస్యలను పట్టించుకోని పాలక వర్గాలు
- మున్సిపాలిటీల్లో ముందుకు సాగని కొత్త పనులు
- కొన్ని రోజుల్లో వరుసగా ఎన్నికల కోడ్
- అభివృద్ధి పనులు మరింత ఆలస్యమయ్యే ఛాన్స్

మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానాలు

కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాలేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు అంతంత మాత్రంగానే ఉన్నది. సమస్యలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి సమయంలో అవిశ్వాసాల పేరుతో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలకు తెరదీసింది. బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను దింపడమే లక్ష్యంగా పాలిటిక్స్ చేస్తున్నది. కౌన్సిలర్లను ఇతర ప్రాంతాలకు తరలించి జోరుగా క్యాంపులు నిర్వహిస్తున్నది. ప్రజా సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. దాంతో మున్సిపాలిటీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. కొత్త పనులు ముందుకు సాగడం లేదు. మరోవైపు వరుసగా ఎన్నికలు ఉండటంతో కోడ్‌తో పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు లేకపోలేదు.

– యాదాద్రి భువనగిరి, జనవరి 24 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిల్లో సగం పురపాలికల్లో అవిశ్వాస రాజకీయాలు జరుగుతున్నాయి. భువనగిరిలో ఇటీవల మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై అవిశ్వాసం పెట్టి పదవుల నుంచి దించారు. ఇక ఆలేరు, మోత్కూరులో అవిశ్వాస తీర్మానాలకు కౌన్సిలర్లు లేఖ అందించడంతో అక్కడా అవిశ్వాస తీర్మానాలు పెట్టేందుకు కలెక్టర్ నోటీసులు అందించారు. ఈ నెల 27న ఆలేరు, ఫిబ్రవరి 9న మోత్కూరులో అవిశ్వాస తీర్మాన సమావేశం పెట్టనున్నారు. ఇక యాదగిరిగుట్ట, చౌటుప్పల్ చైర్మన్లు మొదట బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అక్కడ అవిశ్వాసాలపై సైలెంట్‌గా ఉన్నారు.

రాజకీయాలకే ప్రయారిటీ..

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిని పట్టించుకోపోగా రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నదనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికీ రైతుబంధు సగం మందికి కూడా బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. చేతిలో పెట్టుబడి డబ్బులు లేక అన్నదాత అప్పులు చేయాల్సిన పరిస్థితి. దళితబంధు, గొర్రెల పంపిణీ పథకాల అమలు పత్తాలేదు. ఇక మున్సిపాలిటీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. కౌన్సిలర్లు, చైర్మన్లు అవిశ్వాసాలపైనే దృష్టి పెట్టడంతో పురపాలికలను పట్టించుకోవడం లేదు. కొత్త పనులు ప్రారంభించడం లేదు. ఇక ఇప్పుడున్న చైర్మన్లు దిగిపోతే సమస్యలు మరింత జఠిలం కానున్నాయి. ఇక ప్రజలను సమస్యల నుంచి దృష్టి మరల్చడానికే అవిశ్వాసాలు తెరపైకి తెస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతున్నది.

భువనగిరి మున్సిపల్ కార్యాలయం

క్యాంపుల్లో ఆలేరు, మోత్కూరు కౌన్సిలర్లు

అవిశ్వాసాల నేపథ్యంలో జోరుగా క్యాంపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఆశిస్తున్న కౌన్సిలర్లు డబ్బుల ఖర్చుకు వెనుకాడడంలేదు. అవిశ్వాస తీర్మాన లేఖ అందించిన రోజు నుంచే మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు క్యాంప్‌నకు వెళ్లారు. ఇక ఆలేరు పురపాలిక సభ్యులు సైతం క్యాంపులోనే ఉన్నారు. ఇటీవల వరకు భువనగిరికి చెందిన 16మంది కౌన్సిలర్లు క్యాంపులో ఉండగా, అవిశ్వాస సమావేశం రోజు తిరిగొచ్చారు. క్యాంపుల్లో సభ్యులకు ఆశావహులు అన్ని రకాల వసతులు కల్పిస్తుండటం విశేషం.

ప్యాకేజీలు.. తాయిలాలు

మున్సిపల్ చైర్మన్ పదవీ కాలం ఇంకా ఏడాది మాత్రమే ఉంది. దీని కోసం అన్ని చోట్లా ఆశావహులు పలు రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. మద్దతుగా నిలిచేందుకు ప్యాకేజీలు, తాయిలాలు ప్రకటిస్తున్నారు. అవిశ్వాసంలో నెగ్గేందుకు, కొత్తగా ఎన్నుకునేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నారు. ఇటీవల భువనగిరిలోని కొందరు కౌన్సిలర్లకు ముందస్తుగా రూ. లక్ష చొప్పున ముట్టాయనే ప్రచారం ఉన్నది. చైర్మన్ ఎన్నిక సమయంలో మరికొంత ముట్టజెబుతామనే హామీలు ఇచ్చినట్లు తెలిసింది. ఇక ఆలేరు, మోత్కూరులోనూ కౌన్సిలర్లకు ప్యాకేజీలు ఆఫర్ చేశారు.

వరుస ఎన్నికల కోడ్‌తో అడ్డంకులు..

రానున్న రోజుల్లో రాష్ట్రంలో వరుసగా ఎన్నికలు జరుగనున్నాయి. పార్లమెంట్, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో వరుసగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. కోడ్ నేపథ్యంలో కొత్త పనులకు శంకుస్థాపనలు, ప్రారంభించడం జరుగదు. దాంతో అభివృద్ధి పనులు ఆగిపోయే అవకాశం ఉంది. ఇప్పుడున్న కొద్ది సమయాన్ని అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగించుకోకుండా కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

చదువుతోపాటు సమాజంపై అవగాహన అవసరం

• జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు

భువనగిరి అర్బన్, జనవరి 24 : బాలికలు చదువుతోపాటు సంఘంలోని స్థితిగతులు తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా విద్యా శాఖ, జిల్లా సంక్షేమ, బాలల సంరక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం భువనగిరి పట్టణ పరిధిలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ప్రలోభాలకు గురి కావద్దని, సాంకేతికతను అవగతం చేసుకొని మంచిని ఉపయోగించుకోవాలని, ఏదైనా సమస్య ఉంటే న్యాయ సేవ సంస్థలను ఆశ్రయించవచ్చని తెలిపారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.మారుతి దేవి మాట్లాడుతూ బాలికలపై అకృత్యాలు సమాజంలో ఎక్కువ అవుతున్నాయని, వీటిని రూపుమాపాలంటే ప్రతి ఒక్కరూ సంఘంలో బాధ్యతగా ఉండి బాలికలపై జరిగే నేరాలను అరికట్టడంలో సంబంధిత శాఖలతోపాటు పాలుపంచుకోవాలని చెప్పారు. జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె. దశరథ రామయ్య మాట్లాడుతూ బడికి రాకుండా ఉన్న బాలికలను గుర్తించి బడికి పంపేలా, అవసరమైనచోట బాలికల తల్లిదండ్రులకు తగిన సలహా, సహకారం అందజేయాలని సూచించారు. గత వారం రోజులుగా బాలిక హక్కులు, సంరక్షణ వంటి అంశాలతో పోటీపరంగా కాకుండా వారిలో ఒక చైతన్యాన్ని తీసుకురావడానికి సంబంధిత శాఖల సమన్వయంతో ప్రయత్నం చేశామని తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షురాలు బి.జయశ్రీ మాట్లాడుతూ తమ సంస్థ బాలల సంక్షేమానికి చట్ట ప్రకారంగా విధులు నిర్వర్తిస్తూ కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బడి మానేసిన బాలికలను గుర్తించి తిరిగి బడిలో చేర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కిట్, గ్రూప్ డిస్కషన్‌లో గెలుపొందిన విద్యార్థినులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, డీడబ్ల్యూఓ అన్నపూర్ణ, జీసీడీఓలు నిర్మల జ్యోతి, రాధ, కళాశాల ప్రిన్సిపాల్ వహేద, భువనగిరి రూరల్ ఎస్ఐ రాఘవేందర్ పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, జనవరి 24 : మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద బుధవారం ఉదయం 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం లప్పనాయక్‌తండాకు చెందిన దీరావత్ మధు (22) అదే గ్రామానికి చెందిన దీరావత్ రాము (23) సూర్యాపేట జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి రేషన్ బియ్యం సేకరించి హైదరాబాద్‌లోని శంషాబాద్‌కు తరలిస్తున్నారు. పంతంగి టోషగేట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టి బియ్యాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎంతో చర్చించాకే వైటీడీఏ ప్రక్షాళనపై నిర్ణయం

- వైటీడీఏ, దేవస్థానం అధికారులతో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- కొలిక్కిరాని అంశాలు.. మరోసారి సమీక్ష

యాదగిరిగుట్ట ప్రెసిడెన్షియల్ సూట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు జెండగే

యాదగిరిగుట్ట, జనవరి 24 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి, వైటీడీఏ ప్రక్షాళనపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాకే తుది నిర్ణయం తీసుకుంటామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో డిపో పరిమితి, బస్సుల సంఖ్య పెంచి కొండపైకి ఉచిత బస్సుల సంఖ్య పెంచుతామని అన్నారు. కొండపైకి ఆటో కార్మికుల అనుమతిపై తుది నిర్ణయం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖదే అని వెల్లడించారు. బుధవారం ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్యతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చక బృందం పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ ప్రధానార్చక బృందం వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ రామకృష్ణారావు స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈఓ రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ, వైటీడీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, పెండింగ్ పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.300 కోట్ల పెండింగ్ పనులు ఉన్నాయని అధికారులు వెల్లడించినట్లు తెలిపారు. కొండపై భక్తుల వసతులను గుర్తిస్తామన్నారు. కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద నిర్మించిన బ్రిడ్జిని తీసివేయాలా.. లేదా అన్న అంశంపై మరోసారి సమీక్ష జరిపి నిర్ణయిస్తామని చెప్పారు. బస్వాపూర్ జలాశయం చివరి దశ పనులు పూర్తి చేస్తామన్నారు. గంధమల్ల జలాశయాన్ని త్వరలోనే పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగుజలాలు అందజేస్తామన్నారు. ఇవన్నీ సీఎం రేవంత్ రెడ్డితో చర్చించాకే చేపడుతామన్నారు.

కొలిక్కిరాని అంశాలు.. మరోసారి సమీక్ష

గత ప్రభుత్వ హయాంలో ఆలయాన్ని రూ.1400 కోట్లతో పునర్నిర్మించారు. కొండపైన దాదాపుగా పనులు పూర్తయ్యాయి. సంగీత భవనం, కల్యాణ మండపంతోపాటు పార్కింగ్ ప్రాంతాన్ని విస్తరించాల్సి ఉంది. హరిత హోటల్ పునరుద్ధరణ, కొండకింద ప్రధాన రోడ్డు భాదితులకు కేటాయించాల్సిన షాపింగ్ కాంప్లెక్స్, గండి చెరువు సుందరీకరించి తెప్పోత్సవం ఏర్పాటు చేయాల్సి ఉంది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇందుకనుగుణంగా కొండపైన భక్తులకు వసతులు కల్పించాల్సి ఉంది. గత ఎన్నిక సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని సంక్రాంతి పండుగ తరువాత నెరవేరుస్తామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆటో కార్మికులకు హామీనిచ్చారు. కానీ, మంత్రి కోమటిరెడ్డి మాత్రం మొదటిసారిగా చేపట్టిన సమీక్ష పేరుతో గంటన్నర కాలయాపన చేసి స్పష్టత ఇవ్వకుండానే వెనుదిరిగారు. వచ్చే నెల 3న దేవాదాయ శాఖ మంత్రి, ప్రభుత్వ విప్ , వైటీడీఏ అధికారులతో సమీక్ష జరిపి ఆలయ అభివృద్ధి, వైటీడీఏ ప్రక్షాళనపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ హనుమంత్ కె.జండగే, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈఓ రామకృష్ణారావు, డీసీపీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య, డీఏఓ అనూరాధ, వైటీడీఏ ఈఈ వెంకట్‌రెడ్డి, ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ రమేశ్ పాల్గొన్నారు.

వంద రోజుల్లో అభయ హస్తం గ్యారెంటీలు..

యాదగిరిగుట : వందరోజుల్లో అభయ హస్తం గ్యారంటీ పథకాలను ప్రజలకు చేరవేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరులో మహిళా సంఘం, గ్రంథాలయ భవనాలకు శంకుస్థాపన చేసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే ఆలేరు మండలం కొలనుపాకలో రూ.15 కోట్లతో సెంట్రల్ లైటింగ్, జైన్ మందిరానికి వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు.

ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు

బొమ్మలరామారం : ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి బుధవారం మండలంలోని హాజీపూర్ గ్రామంలో శామీర్‌పైట వాగుపై రూ.6.31 కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన, మైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తొలి విడుతగా అలేరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అందరికీ అభివృద్ధి ఫలాలు అందిస్తామని చెప్పారు.కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సర్పంచ్‌లు కవితా వెంకటేశ్‌గౌడ్, వడ్లకొండ అరుణ, ఎంపీటీసీ పక్కీర్ రాజేందర్‌రెడ్డి, బోయిని లత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజలను చైతన్యపర్చాలి

• ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

రామగిరి, జనవరి 24 : నేటి ఆధునిక సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే జనంలో చైతన్యం కల్పించాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రోగ్రాం అధికారులు కృషి చేయాలని ఎంజీయూ వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఉమ్మడి జిల్లా కళాశాలల్లోని 163 ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం అధికారులకు ఎంజీయూ సమావేశ మందిరంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అన్ని యూనివర్సిటీల కంటే ఎంజీయూలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చాలా బాగా నిర్వహిస్తున్నారని అభినందనలు తెలిపారు. సామాజిక రుగ్మతలను తొలగించి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓలకు వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్స్ శిక్షణ ఇచ్చారు. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఎంజీయూ నుంచి హాజరై ప్రతిభ చూపిన వలంటీర్లను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంజీయూ పాలక మండలి సభ్యులు బోయినపల్లి కృష్ణారెడ్డి, ఉమ్మడి జిల్లాలోని కళాశాలల పీఓలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను గడువులోగా పూర్తి చేయాలి

- ఫిబ్రవరి మొదటి వారంలో నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు
- త్వరలో పూర్తి స్థాయి జిల్లా కమిటీల నియామకం
- రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లింగయ్యయాదవ్

కట్టంగూర్, జనవరి 24 : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పునకు కట్టుబడి ఉండడంతోపాటు జనం సమస్యల పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషిస్తామని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. కట్టంగూర్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, 14 సంవత్సరాలు ఉద్యమం చేసినా రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అన్నారు. రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా సాధించిన తెలంగాణ మొదటి సీఎంగా 10 సంవత్సరాలు భారత దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి వినూత్నమైన సంక్షేమ పథకాలను అమలు చేసి సబ్బండ వర్గాలకు అందించారని తెలిపారు. రాష్ట్రంలో 70 లక్షల సభ్యత్వాలు కలిగిన బలమైన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన హామీలను గడువు ప్రకారం పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పూర్తి చేయడంలో గానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేసే వరకూ పార్టీ పరంగా ప్రభుత్వాని నిలదీస్తామని చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లాకు చెందిన రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ సమావేశాలు నిర్వహించి కార్యకర్తలు, కిందిస్థాయి నాయకుల అభిప్రాయాలను తీసుకొని ఓటమి మీద సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి మొదటి వారంలో అన్ని నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు, సమావేశాలకు కేసీఆర్, కేటీఆర్‌ను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని, ఉమ్మడి జిల్లా కమిటీలను త్వరలో ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు.